'తన అత్తగారు చేసిన తప్పే మళ్ళీ తను చేయకూడదు. నా జీవితంలా ఇంకో ఆడపిల్ల జీవితం కాకూడదు. వ్యసనపరుడయిన ఓ భర్తకు భార్యగా సంఘంలో తనెన్ని అవమానాలు పొందిందీ, అతడు బ్రతికి ఉన్నప్పుడు మరణానంతరం ఎంత మానసిక సంఘర్షణకు లోనయిందో అనుభవించిన తనకు మాత్రమే తెలుసు. కొడుక్కి పెళ్ళి చేసి ఇంకో అమాయకురాలి జీవితం మొగ్గలోనే తుంచకూడదు.'


'ముందుతరం వారు చేసిన పొరపాట్లు మళ్ళీ మళ్ళీ మనమూ చేస్తే అదే పరిస్థితి పునరావృతమవుతూ సమస్య మాత్రం అపరిష్కృతంగానే వుంటుంది. ఇప్పుడిప్పుడే వ్యసనాలకు దగ్గరవుతున్న కొడుకుని మంచిగా మార్చుకోవడం బాధ్యతగల ఓ తల్లిగా తన తక్షణ కర్తవ్యం. సరైన సమయంలో తీసుకున్న సరైన నిర్ణయం ఉషోదయంలా సరైన బాటకు దారి చూపెడుతుంది' అనుకుంది దృఢచిత్తంతో తులసమ్మ.

**-కొప్పుల పద్మావతి**
**(విశాఖపట్నం)**

# పశ్చాత్తాపం

ఏ పేపర్లో చూసినా మధులిక ఫొటోలే. ఐ.ఎ.ఎస్‌లో టాప్ ర్యాంకర్‌గా మధులిక సాధించిన విజయం చిన్నదేమీ కాదు. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా మ్రోగే ఫోన్‌లో శుభాకాంక్షలు. అందుకోలేక భర్త రామకృష్ణ అవస్థపడుతుంటే నవ్వొస్తోంది మల్లికకి. టీవీలో ఇంటర్వ్యూలు అన్నిట్లో మధుది ఒకటే మాట. ''ఈ విజయానికి నేను భూమ్మీదకి రావడానికి అందర్నీ ఎదిరించి పోరాడిన అమ్మే కారణం'' అంటే కళ్ళు చెమర్చాయి. ఇరవై ఏళ్ళనాటి రామకృష్ణ మూర్ఖత్వంతో తను పడిన అవస్థలన్నీ కళ్ళ ముందు నిలిచాయి.

సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగి అయిన రామకృష్ణ ఎన్నో సంబంధాలు చూసిన తరువాత బ్యాంకులో పనిచేస్తున్న తనని ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడు. మూడు నెలలకే నెల తప్పిన తనకి ఎంతో ఆనందంగా ఆ వార్తను తెలియజేస్తే స్కానింగ్ చేయించి ఆడపిల్ల అన్న విషయం తెలియగానే అబార్షన్ చేయించుకోమని వత్తిడి ప్రారంభించాడు. దీనంతటికి కారణం అతని వ్యాపారదృక్పథంతో పాటు చుట్టూ చేరిన కాకారాయుళ్ళ ప్రభావమే అని మాటల ద్వారా తెలిసింది. ''మూడేళ్ళ సర్వీసులో సొంత ఇల్లు కట్టావు. బ్యాంకు ఉద్యోగినే కావాలని పట్టుబట్టి బ్యాంకులో పనిచేసే అమ్మాయిని చేసుకున్నావు. అలాగే ఒకరో ఇద్దరో మగపిల్లల్ని కని వాళ్ళని డాక్టర్ని మరొకడ్ని ఇంజనీరుని చేసి, కట్నం మూట కట్టుకోవడంతోపాటు పిల్లలతో ఫారిన్ కూడా వెళ్తావయ్యా నీ సమర్థత అలాంటిది'' అన్న ఆ భజన బృందం మాటలను పట్టుకొని, తనకు స్కానింగ్ చేయించి ఆడపిల్ల అనగానే తన మీద అబార్షన్ వత్తిడి ప్రారంభించాడు. అతనికేమీ తీసిపోదు అన్నట్లు, అత్తగారు కూడా ''వాడికిష్టం లేనిది ఎందుకమ్మా?'' అంటూ వంత పాడింది. తను అమ్మా నాన్న సహకారంతో మధులికని ఈ భూమ్మీదకి తీసుకురాగలిగింది. తర్వాత మూడేళ్ళకి మనోహర్ పుట్టడం తర్వాత ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకోవడం అయిపోయినా, రామకృష్ణ ప్రవర్తన మధులిక పట్ల ఎప్పుడూ అంతే. టెన్త్‌లో జిల్లా ఫస్ట్ వచ్చి ఇంజనీరింగో, మెడిసనో చేద్దామన్న దాని ఆలోచన సాగనీయకుండా, అన్ని కాలేజీలలో సీటు వచ్చినా ఆర్ట్స్ గ్రూప్‌లో చేర్పించాడు. ఇంటర్ స్టేట్ ఫస్ట్ వచ్చినా, కనీసం ఒక స్వీటుతో నోరు కూడా తీపి చేయలేదు దానికి. తండ్రిగా ఏ ఒక్క బాధ్యత నెరవేర్చక దాన్ని చిన్నచూపు చూసి, మనోహర్‌ని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించి, మంచి మంచి బట్టలు, సైకిళ్ళు, కంప్యూటర్, వీడియోగేమ్స్ ఇలా ఎన్నో కొంటున్నా అదెప్పుడూ చిన్నబుచ్చుకోలేదు. ''నాన్నగారి తత్వం అంతే కదమ్మా'' అంటూ సరిపుచ్చుకునేది. డిగ్రీలో కాలేజీ ఫస్ట్ వచ్చి, గోల్డ్‌మెడల్‌తోపాటు, ఇంటికి వచ్చిన కూతుర్ని ఆశీర్వదించక, ''దీనికొక మొగుణ్ని కొనాలి కాబోలు'' అంటున్న భర్తని చూస్తే తనకే అసహ్యం వేసింది. తర్వాత తనెంత వద్దంటున్నా వినకుండా తనకాళ్ళ మీద తానే నిలబడాలని పట్టుబట్టి ఏదో కంప్యూటర్ ఇన్స్టిట్యూట్‌లో ట్యూటర్‌గా చేరి, సివిల్స్ కోచింగ్ తీస్కొని, మొదటి ప్రయత్నంలోనే టాప్ ర్యాంకర్‌గా వచ్చి, డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ తీసుకుని వస్తున్న తన కూతురు అటు తండ్రికి, ఇటు తనకి మొత్తం కుటుంబానికే ఎంతో పేరు తెచ్చింది. ''తన చిట్టి తల్లిని ఆ రోజు భర్త మూర్ఖత్వానికి మొగ్గలోనే తుంచి వేస్తే ఈరోజు ఈ ప్రశంసలు, ఆనందం తమకు దక్కేవా? తండ్రి అతిగారాబంతో మగవాడినన్న అహంకారంతో ఎమ్‌సెట్‌లో కనీసం క్వాలిఫై కూడా కాని మనోహర్‌ని తను దారిలో పెట్టగలడా? తండ్రి మూర్ఖత్వంతో పాటు మొండితనం, ఇవన్నీ పుణికి పుచ్చుకున్న మనోహర్ రేపు వృద్ధులమైన తమని ఆదుకుంటాడా? ఇవన్నీ అర్థంకాని రామకృష్ణ తన కూతురు సాధించిన విజయానికి పశ్చాత్తాపడతాడా? అని మథన పడుతున్న మల్లికకి ఓదార్పుగా మృదువుగా తట్టిన తన భర్త చేతులు, తన చేతుల్లో చేతులు వేసి, ''మల్లికా! నన్ను క్షమించవూ! నీకు, మధుకీ నేను చేసిన అన్యాయానికి నన్ను ఆ దేవుడు కూడా క్షమించడేమో కదూ! రక్తం పంచుకుని పుట్టిన పిల్లలిద్దరూ మనకి రెండు కళ్ళ లాంటి వాళ్ళే, ఒకదాన్ని పొడుచుకోవాలని చూసిన నాకు ప్రాయశ్చిత్తం లేదు. మూర్ఖంగా ఆడపిల్ల అంటే పరాయిపిల్లగా చూశాను కదూ! అది ఘోరమైన తప్పు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మి, ఇంటికి, తల్లికి తండ్రికి మంచి తెచ్చే మహాలక్ష్మి. దాన్నే నేను కించపరిచాను చూడు. నా పాపానికి ఆ దేవుడు కూడా క్షమించడు. నా చిట్టితల్లిని ఇప్పుడే కలిసి, దాని విశాల వ్యక్తిత్వం ముందు, దాని మంచి మనసు, దాని మేధాశక్తికి ఈ అల్పుడి క్షమాపణలు అర్పించాలి. నడు, త్వరగా బయల్దేరు, స్టేషన్‌కి వెళ్ళి డిప్యూటీ కలెక్టర్‌గా అడుగుపెడుతున్న నా బంగారు తల్లిని రిసీవ్ చేసుకుందాం'' అంటున్న భర్తను చూస్తూ ఆనందంగా కారు వైపు నడిచింది మల్లిక.



**-బి. అమృతవర్షిణి (సికింద్రాబాద్)**